


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శనివారం 9-8-2025
సంపుటి: 21 సంచిక: 118
పేజీలు: 8 వెల: రూ.1



- కలకలం రేపిన ఏసీబీ ట్రాప్ ఉదంతంలో ట్విస్ట్
- యాసిడ్ టెస్ట్ కోసం తన చెయ్యి విరిచేశారని శ్రీనివాస్ ఆరోపణ
- ట్రాప్ తర్వాత ఆయన నిక్షేపంగా ఉన్నట్లు తేల్చిన వీడియోలు
- కానీ కోర్టు ముందు కొత్త ఆరోపణలు చేసిన నిందితుడు

లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ సబ్బవరపు శ్రీనివాస్ కేసు కోర్టుకెళ్లే దారిలో మరో మలుపు తిరిగింది. తాను లంచం తీసుకోలేదని.. ఏసీబీ అధికారులే రూ.25 లక్షలు తన ముందు పెట్టి యాసిడ్ టెస్ట్ కోసం తన చెయ్యి విరిచేసి బలవంతంగా నోట్లపై పెట్టించారని పేర్కొనడంతో ఈ కథలో ట్విస్ట్ చోటుచేసుకుంది. సబ్బవరపు శ్రీనివాస్ ఇటువంటి వ్యవహారాల్లో మహా ముదురని ఏసీబీ అధికారులకు తెలిసినా, తగు జాగ్రత్తలు తీసుకోపోవడమే ఆయన ఎమోషనల్ 'కట్టు'కథ అల్లేందుకు ఉపయోగపడింది.



# తప్పించుకునే ఎత్తుగడ
# ఈఎన్‌సీ చెయ్యి 'కట్టు' కథ!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చేతికి సిమెంట్ కట్టుతో కనిపిస్తున్న శ్రీనివాస్ అవినీతి సొమ్ము ద్వారా పదోన్నతులు పొందడంతోపాటు పరపతి, ఆస్తులు పెంచుకున్న మాట వాస్తవమే కానీ.. ఈ ట్రాప్ మాత్రం ప్రీప్లాన్డ్‌గా ఆయన శత్రువులు, ఏసీబీ అధికారులు కుమ్మక్కై చేశారన్న వాదన తాజాగా తెరపైకి వచ్చింది. గురువారం శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు ట్రాప్ చేసిన ఉదంతాన్ని ఎలక్ట్రానిక్ మీడియా పెద్ద ఎత్తున కవర్ చేసింది. ఆ సందర్భంలో టీవీ ఛానళ్లు ప్రసారం చేసిన ఏ వీడియోలోనూ చెయ్యి విరిగిపోయి ఆయన ఇబ్బంది పడుతున్న దృశ్యాలు కనిపించలేదు. కానీ శుక్రవారం సాయంత్రం ఏసీబీ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినప్పుడు మాత్రం తాను లంచం తీసుకోలేదని.. ఏసీబీ అధికారులే తన చెయ్యి విరగ్గొట్టి మరీ నోట్ల మీద యాసిడ్ టెస్ట్ కోసం చేతులు పెట్టించారని ఆరోపించడంతో శనివారం ఆయన్ను వైద్యపరీక్షలకు పంపారు. ఆ పరీక్షల్లో చెయ్యి విరిగినట్లు తేలడంతో ఆయనకు కట్టు వేశారు. ఈ ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం అదే. శ్రీనివాస్ స్టేట్‌మెంట్ మేరకు రిమాండ్ రిపోర్టు తీసుకురమ్మని ఏసీబీ అధికారులకు మెజిస్ట్రేట్ ఆదేశించారు.

## ఏసీబీ ట్రాప్ ఆయన బాధితుల ప్లానే

రూ.రెండు వేల నోట్లు రద్దయిన తర్వాత ఒకసారి, ఇటీవల ఆర్‌బీఐ నిబంధనల మేరకు మరోసారి రూ.3 లక్షలకు మించి క్యాష్ ట్రాన్జక్షన్ (నగదు లావాదేవీలు) జరపకూడదని రిజర్వ్ బ్యాంకు ఆదేశించింది. కానీ తాజా ఏసీబీ ట్రాప్‌లో రూ.25 లక్షలు ఎక్కడి నుంచి తెచ్చారన్న దానికి ఫిర్యాదుదారుడు రుజువులు చూపించాల్సి ఉంటుంది. తనతో పని చేసిన ఇంజినీరింగ్ అధికారులను శ్రీనివాస్ వేధించడంతో వారంతా విసిగిపోయి శ్రీనివాస్ తెర వెనుక పార్టనర్‌గా ఉన్న సంస్థ ద్వారా ఆయన్ను ట్రాప్ చేయించినట్లు తెలుస్తోంది. ఏడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి తాను అజ్ఞాత పార్టనర్‌గా ఉన్న సత్యసాయి కన్‌స్ట్రక్షన్స్‌కు శ్రీనివాస్ రూ.5 కోట్లు ఇచ్చారన్న ప్రచారం ఉంది. అలాగే వీటి ఎస్టిమేషన్లు కూడా పెంచి లబ్ధి చేకూర్చాలని శ్రీనివాస్ చూశారట. వాటి ఫైనల్ బిల్లు రూ.35.5 కోట్లు చెల్లించేటప్పుడు తన అసలు రూ.5 కోట్లు, ఎస్టిమేట్లు పెంచడం ద్వారా, కాంట్రాక్ట్ చేయడం ద్వారా వచ్చిన లాభంతో కలిపి మరో రూ.3 కోట్లు, రొటీన్‌గా ఈఎన్‌సీకి ఇవ్వాల్సిన లంచంతో కలిపి పెద్ద మొత్తం డిమాండ్ చేయడంతో సత్యసాయి కన్‌స్ట్రక్షన్స్ అధినేత చెరుకూరి కృష్ణంరాజు ఏసీబీని ఆశ్రయించారనేది అధికారుల కథనం. కానీ సబ్బవరపు శ్రీనివాస్ ఏఈగా ఉన్నప్పుడు ఏఈలుగానో, డీఈగా పదోన్నతి వచ్చిన తర్వాత డీఈ హోదాలోనూ పలు స్థాయిల్లో ఆయనతో పాటు పని చేసిన అనేకమందిని ఈఎన్‌సీగా పదోన్నతి పొందిన తర్వాత వేధించడం మొదలుపెట్టారట. తమతో పాటు డీఈగానో, ఈఈగానో ఉండాల్సిన శ్రీనివాస్ ఏకంగా ఈఎన్‌సీ అయిపోవడం వీరందరికీ ఒక రకంగా అవమానం. మరోవైపు ఆ కుర్చీలో కూర్చున్న తర్వాత శ్రీనివాస్ తనతో పాటు ఈ స్థానానికి పోటీ పడతారని భావించే ఇంజినీరింగ్ అధికారులను వేధించడం మొదలుపెట్టారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈఎన్‌సీ పోస్టుకు పలువురు తీవ్రంగా పోటీపడ్డారు. ఏసీబీ కేసు ఉన్నప్పటికీ ఏం మాయ చేశారో తెలియదు గానీ.. ఇన్‌ఛార్జి ఈఎన్‌సీగా శ్రీనివాస్ కుర్చీ దక్కించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా దీన్ని గట్టిచేసుకోవడంతో పాటు రెగ్యులర్ ఈఎన్‌సీ పోస్టు తెచ్చుకున్నారు.

## నీవు నేర్పిన విద్యే..

ఈమధ్య కాలంలోనే తనతో పాటు పనిచేసిన ఈఈ జామి శాంతేశ్వరరావు, మరో ఈఈ తూతిక మోహనరావు, డీఈ సింహాచలం, ఈఈ డీవీఆర్ఎం రాజు, మరో ఈఈ కేవీఎస్ఎన్ కుమార్‌లతో పాటు చాలా మందికి రివర్షన్ ఇవ్వడం లేదా శాఖాపరంగా వేధించడం వంటి చర్యలు ఈఎన్‌సీ శ్రీనివాస్ పాల్పడ్డారని చెబుతున్నారు. ఇందులో - మిగతా చివరి పేజీలో

## పదవి నుంచి విశ్రాంతి
# అయినా అయ్యవారే గతి!

- పదిరోజులైన నియామకం కాని రెగ్యులర్ డీఈవో
- ఎవరికీ ఎఫ్ఏసీ కూడా అప్పగించని అధికారులు
- కార్యాలయంలో పేరుకుపోతున్న కీలక ఫైళ్లు
- రిటైరైన తిరుమల చైతన్యతోనే పాత తేదీలతో సంతకాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఉద్యోగ విరమణ చేసి పదిరోజులు కావస్తున్నా ఇంకా రెగ్యులర్ డీఈవోను నియమించలేదు. దాంతో ఇప్పటికీ తిరుమల చైతన్యే తెరవెనుక అనధికార డీఈవోగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కీలకమైన విద్యాశాఖకు పది రోజులుగా జిల్లా స్థాయి అధికారి లేకపోవడంతో ఆర్థికపరమైన ఫైల్స్ ఆమోదం పొందలేక నిలిచిపోయాయి. ఫలితంగా పలువురు ఉపాధ్యాయులకు జీతాలు కూడా అందని పరిస్థితి నెలకొందంటున్నారు. ఇదే అదనుగా పాత తేదీ (బ్యాక్‌డేట్) లతో ఫైళ్లు రన్ చేసి తిరుమల చైతన్యతో సంతకాలు చేయిస్తున్నట్టు తెలిసింది. కొన్నాళ్ల క్రితం ఉపాధ్యాయ బదిలీలు జరిగాయి. కొత్త స్థానాల్లో చేరిన వారికి అక్కడే జీతాలు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలి. ఈ తరుణంలో తిరుమల చైతన్య రిటైర్ కావడంతో ఆ ఫైల్ నిలిచిపోయింది. ఫలితంగా చాలామంది టీచర్లకు జీతాలు అందని పరిస్థితి నెలకొంది. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో బ్యాక్‌డేట్ వేసి తిరుమల చైతన్యతో సంతకాలు చేయించాల్సి వస్తోందని వినికిడి. వాస్తవానికి డీఈవో రిటైర్ కావాల్సి ఉంటే.. దానికి పది రోజుల ముందే కొత్త డీఈవోను నియమించాలి లేదా ఎవరికైనా ఎఫ్ఏసీ(పూర్తి అదనపు బాధ్యతలు) ఇవ్వాలి. ఈ రెండూ జరక్కపోవడంతో డీఈవో కార్యాలయంలో ఫైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

## ఆ పోస్టుకు పలువురి పైరవీలు

పక్కనున్న పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా ఇదే పరిస్థితి. మూడు నెలల నుంచి ఇక్కడ డీఈవో పోస్టు ఖాళీగా ఉంది. ప్రభుత్వం ఇప్పటికీ ఎవర్నీ నియమించకపోవడంతో అక్కడ జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ధైర్యంగా ఒకడుగు ముందుకేసి రాజ్‌కుమార్ అనే ఒక ఉపాధ్యాయుడికి డీఈవో బాధ్యతలు అప్పగించి, పరిపాలన స్తంభించిపోకుండా చూశారు. శ్రీకాకుళంలో మాత్రం ఇప్పటి వరకు ఎవర్నీ నియమించలేదు సరికదా.. సంతకాలు పెట్టే పవరున్న పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కూడా ఎవరికీ ఇవ్వలేదు. ఎందుకంటే.. శ్రీకాకుళం డీఈవో పోస్టుకు విపరీతమైన డిమాండ్ ఉంది. తిరుమల చైతన్య డీఈవోగా చేసినప్పుడే ఆయన ఆ పోస్టుకు అనర్హుడు కాబట్టి తమకివ్వాలంటూ అనేకమంది అనేక రకాలుగా పైరవీలు చేశారు. మంత్రి పేషీ మాత్రం ఈయన వైపే మొగ్గు చూపడంతో పదవీ విరమణ వరకు తిరుమల చైతన్యే కొనసాగారు. ఎట్టకేలకు ఇక్కడ డీఈవో పోస్టు ఖాళీ కావడంతో దాన్ని అందిపుచ్చుకోవడానికి పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నాయి. సుధాకర్ అనే ఒక లెక్చరర్‌ను డీఈవోగా తీసుకురావడానికి శ్రీకాకుళం, పలాస ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు ఇవ్వడంతోపాటు ఈయనకు మంత్రి అచ్చెన్నాయుడు అండదండలు ఉన్నాయని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. అలాగే పాడేరులో డీఎస్ఈవోగా పని చేస్తున్న బ్రహ్మాజీకి కూడా మంత్రి పేషీ అండదండలు ఉన్నాయని, ఆయన్ను నియమిస్తారని ప్రచారం జరుగుతోంది.

గతంలో ఇక్కడ డీఈవోగా కొద్దికాలం పని చేసి, ప్రస్తుతం ఆర్‌జేడీ కార్యాలయంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న డీవీఏ నర్సింగరావు కూడా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. శ్రీకాకుళం డీఈవో కార్యాలయంలో ఏడీగా పని చేస్తున్న రవిబాబు సైతం డీఈవో పోస్టుపై కన్నేశారు. ఆ మేరకు ఇటీవలే ఆయన డిపార్ట్‌మెంటల్ టెస్ట్ రాశారు. అయితే దాని ఫలితాలు ఇంకా వెలువడలేదు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా.. అన్నట్టు మంత్రులు తలచుకుంటే ఎవర్నయినా డీఈవోగా తేవచ్చు. పార్వతీపురం మన్యం జిల్లాకు మాత్రం గున్ను రామ్మోహనరావు అనే ఉపాధ్యాయుడ్ని డీఈవోగా నియమించడానికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సిఫార్స్ చేసినట్లు తెలిసింది.

# టెక్కలి నుంచి తప్పించండి మహాప్రభో!

- ఎల్.ఎన్.పేట మండల ప్రజల వేడుకోలు
- వైకాపా హయాంలో అనాలోచితంగా డివిజన్ మార్పు
- అప్పట్లోనే వ్యతిరేకించినా పట్టించుకోని నాటి ప్రభుత్వం
- రవాణా సౌకర్యాలు లేక మూడేళ్లుగా అవస్థలు
- మళ్లీ జిల్లాల విభజన ఉంటుందన్న వార్తలతో ఆశల మోసులు
- తమ మండలాన్ని మళ్లీ శ్రీకాకుళం డివిజన్‌లో కలపాలని వినతి



(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక పోయినట్లు.. గత వైకాపా సర్కారు హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజన ప్రక్రియ చాలా ప్రాంతాల వారిని కొత్త ఇబ్బందులోకి నెట్టింది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ జిల్లాలోని లక్ష్మీనర్సుపేట(ఎల్.ఎన్.పేట) మండలం. జిల్లా పునర్విభజనలో భాగంగా ఈ మండలాన్ని తీసుకెళ్లి దూరంగా ఉన్న టెక్కలి డివిజన్‌లో పడేశారు. సరైన అధ్యయనం చేయకుండా.. సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా.. భౌగోళిక, సామాజిక అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా లోక్‌సభ నియోజకవర్గాలే ప్రాతిపదికగా రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలకు 26 జిల్లాలకు అప్పటి జగన్ సర్కారు పెంచింది. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలో పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం మొత్తాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలోకి రాజాం నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలో చేర్చారు. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాలు పోగా మిగిలిన 30 మండలాలతో కొత్త శ్రీకాకుళం జిల్లాను ప్రకటించినా రెవెన్యూ డివిజన్ల వర్గీకరణకు వచ్చేసరికి ఎల్.ఎన్.పేటకు అన్యాయం జరిగింది.

## డివిజన్ల వర్గీకరణలో అన్యాయం

జిల్లాల పునర్విభజనతోపాటు రెవెన్యూ డివిజన్లు, మండలాల పరిధుల మార్పు ప్రక్రియను కూడా వైకాపా సర్కారు చేపట్టింది. ఆ మేరకు 2022 ఏప్రిల్ రెండో తేదీన కొత్త శ్రీకాకుళం జిల్లా నైసర్గిక స్వరూపాన్ని నిర్వచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాని ప్రకారం రెండు నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాలను తొలగించి 30 మండలాలతో కొత్త శ్రీకాకుళం జిల్లా మనుగడలోకి వచ్చింది. అదే సమయంలో అప్పటివరకు జిల్లాలో ఉన్న శ్రీకాకుళం, టెక్కలి రెవెన్యూ డివిజన్లకు అదనంగా పలాసను డివిజన్ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. ఆ మేరకు జిల్లాలోని 30 మండలాలను మూడు రెవెన్యూ డివజన్లకు అదే జీవో ద్వారా కేటాయించారు. ఇక్కడే ఎల్.ఎన్.పేట విషయంలో అన్యాయం జరిగింది. మాండలిక వ్యవస్థ ఏర్పడినప్పుడు కాకుండా ఆ తర్వాత చాన్నాళ్లకు లక్ష్మీనర్సుపేట కేంద్రంగా ఏర్పాటైన ఎల్.ఎన్.పేట మండలం అప్పటినుంచీ శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో అంతర్భాగంగా కొనసాగుతూ వచ్చింది. కానీ రెవెన్యూ డివిజన్ల పునర్వర్గీకరణ సమయంలో అన్ని మండలాలను సమానంగా మూడు డివిజన్లకు పంచాలనుకుందో ఏమో గానీ రాష్ట్ర ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా, ఎవరూ కోరకుండానే శ్రీకాకుళం డివిజన్‌లోని ఎల్.ఎన్.పేటను తీసుకెళ్లి టెక్కలి డివిజన్‌లో చేర్చింది. అప్పట్లో ఈ నిర్ణయాన్ని మండల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించి, మార్చాలని కోరినా ఆ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా స్పందించలేదు.

## దూరాభారంతో అవస్థలు

జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన శ్రీకాకుళం నగరంతో పోల్చితే టెక్కలికి ఎల్.ఎన్.పేట చాలాదూరంలో ఉంటుంది. శ్రీకాకుళం-ఎల్.ఎన్.పేట మధ్య దూరం 41 కిలోమీటర్లు. ఈ రెండింటికీ మధ్యలో నియోజకవర్గ కేంద్రం, పట్టణ ప్రాంతమైన ఆమదాలవలస కూడా ఉంది. ఈ రెండింటి మధ్య రవాణా సౌకర్యాలు పుష్కలంగా ఉన్నాయి. అదే ఎల్.ఎన్.పేట నుంచి టెక్కలి చాలా దూరంలో ఉంది. నేరుగా రవాణా సౌకర్యాలు కూడా లేవు. దాంతో ఎల్.ఎన్.పేట నుంచి ఆమదాలవలస లేదా శ్రీకాకుళానికి వచ్చి అక్కడి నుంచి టెక్కలిలోని డివిజన్ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇది మండల ప్రజలకు దూరాభారంతో కూడినది. దాంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకునేందుకు టెక్కలి డివజన్ కేంద్రానికి వెళ్లాలంటేనే స్థానిక ప్రజలు భయపడిపోతున్నారు. తమ మండలాన్ని తిరిగి శ్రీకాకుళం డివిజన్‌లో చేర్చాలని కోరుతూ గతంలో పలుమార్లు స్థానిక ప్రజలు అధికారులు, నాయకులకు వినతిపత్రాలు సమర్పించారు. కాగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జిల్లాల పునర్విభజనకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఎల్.ఎన్.పేట ప్రజలు ఈసారైనా తమ కష్టాలను గమనించి, విన్నపాన్ని మన్నించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మేరకు రెండురోజుల క్రితం సమావేశమైన స్థానిక ప్రముఖులు ఎల్.ఎన్.పేట మండలాన్ని టెక్కలి నుంచి తప్పించి శ్రీకాకుళం డివిజన్‌లో కలపడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు స్థానికులు సంతకాలతో కూడిన లేఖ అందజేశారు. తమ విజ్ఞప్తిని మన్నించి గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని సరిదిద్ది తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

• ఎడిటోరియల్

# 'ఆర్థిక' అవగాహన లేని అమాత్యులు!

సమాజంలో అన్ని రంగాల గురించి అందరికీ తెలియదు. ఒక రంగం గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేసి నైపుణ్యం సాధించినవారిని ఆయా రంగాల ప్రముఖులుగా పరిగణిస్తుంటాం. అందరికీ.. అన్నింటిలోనూ ప్రవేశం, పాండిత్యం, పరిజ్ఞానం ఉండాల్సిన అవసరం లేదు.. ఉండాలనుకోవడం సమంజసం కూడా కాదు. కానీ కొన్ని ప్రత్యేక రంగాలవారికి మాత్రం మిగతా అన్ని రంగాల అంశాలపై పూర్తి పట్టు లేకపోయినా.. కనీస పరిజ్ఞానం మాత్రం తప్పనిసరిగా ఉండాలి. రాజకీయ నాయకులు, జర్నలిస్టులు ఈ కోవలోకి వస్తారు. జర్నలిస్టులు సమాజ వారధులైన జర్నలిస్టులు అన్ని రకాల వార్తలను ప్రజలకు అందించాల్సి ఉంటుంది కనుక అన్ని రంగాలపై కాస్తో కూస్తో పరిజ్ఞానం వారికి తప్పనిసరి. అలాగే ప్రజాప్రతినిధులుగా ఉంటూ ప్రభుత్వాలను నడిపే నాయకులకు ప్రతి అంశం గురించి రేఖామాత్రంగానైనా తెలిసి ఉండాలి. లేకపోతే అధికారులు ఇచ్చే సమచారంపైనే ఆధారపడాల్సి ఉంటుంది. చాలా సందర్భాల్లో ఈ సమాచారాన్ని మించి మాట్లాడాల్సిన అవసరం ఏర్పడుతుంటుంది. అలాంటప్పుడు మాట్లాడలేక.. మాట్లాడినా తప్పులు దొర్లి ప్రజల్లో చులకన అయిపోతారు. ఇప్పుడు ఇటువంటి పరిస్థితినే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఎదుర్కొంటున్నారు. రాష్ట్రాన్ని పాలించే స్థాయిలో ఉన్న నేతలు తమకు ఫలానా అంశం గురించి తెలియదు, అవగాహన లేదు అని చెప్పడాన్ని.. వారి నిజాయితీ అని చెప్పుకోవచ్చేమోగానీ.. అలా చెప్పడం వారికే నామోషీ. ప్రభుత్వంలో ఉన్నవారు అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రాజెక్టులు, పథకాల గురించి కనీస అవగాహన ఏర్పరచుకోకతప్పదు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లినప్పుడు, మీడియాతో మాట్లాడేటప్పుడు ఎటువంటి అంశాలు ప్రస్తావనకు వస్తాయన్నది ఊహించలేం. ఎవరైనా ఒక సమస్య ప్రస్తావించినా, ప్రశ్న అడిగినా అది తనకు సంబంధంలేని శాఖ అనో.. దాని గురించి తనకు తెలియదనో చెప్పడం బేలతనమే అవుతుంది. కానీ పవన్‌కల్యాణ్ ఇదే రీతిలో వ్యవహరిస్తున్నారు. పోలవరం గురించి అవగాహన లేదు, ఆర్థిక శాస్త్రం గురించి అసలే తెలియదు.. అని అమాయకత్వం ప్రదర్శిస్తున్న ఆయన మరో మూడు దఫాలు సీఎం చంద్రబాబే అని మాత్రం చెప్పేస్తున్నారు. ప్రజలు నిర్ణయించాల్సిన సీఎం అంశం గురించి చెబుతున్న ఆయన రాష్ట్రానికి చెందిన కీలక విషయాలు తెలియవనడం ఘోరం. తెలియకపోతే తెలుసుకోవాలి. అలా చేయకపోవడం ఆయన అసమర్థతగా కనిపిస్తుంది. ఇక కేబినెట్ మరో కీలక మంత్రి నారా లోకేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తన మాటతీరుతో ట్రోలింగ్స్ గురవుతున్నారు. ఈమధ్య ఒక సభలో మాట్లాడుతూ మంగళగిరిలో గెలుపు గురించి మాట్లాడుతూ 91వేల నాలుగు వందల 13వేల మెజారిటీ వచ్చిందని ఉవాచించారు. వాస్తవానికి ఆయనకు వచ్చిన మెజారిటీ 91,413. దాన్ని పలికేటప్పుడు 91వేల నాలుగువందల పదమూడు అని చెప్పాలి. కానీ లోకేష్ మాత్రం మొదట 91వేల అని చెప్పి మళ్లీ చివరిలోనూ 13 తర్వాత వేలు అన్న పదం చేర్చేశారు. ఇది విన్నవారు ముక్కున వేలేసుకుంటున్నారు. అంకెలపై ఆమాత్రం అవగాహన లేదా అని ఎద్దేవా చేస్తున్నారు. చిన్నప్పుడే ప్రాథమిక స్థాయిలోనే ఒకట్లు, పదులు, వందలు, వేలు, లక్షలు అంటూ అంకెలు నేర్పిస్తారు. అలాగే ఒకట్ల స్థానం, పదుల స్థానం, వందల స్థానం, వేలు, లక్షల స్థానాలకు ఎలా గుర్తించాలో, ఎలా రాయాలో, ఎలా పలకాలో.. గురువులు క్షుణ్ణంగా నేర్పిస్తారు. పోనీ లోకేష్ ఔపోసన పట్టిన ఆంగ్లంలోనూ 91,413 అంకెను నైన్టీవన్ థౌజెండ్ ఫోర్ హండ్రెడ్ అండ్ థర్టీన్ అని అంటారే గానీ.. లోకేష్ చెప్పినట్లు చెప్పరు. గణితంపై కనీసం ప్రాథమిక అవగాహన లేకుండా పవన్, లోకేష్ మాట్లాడటం విడ్డూరమనిస్తుంది. 2025-26లో మన రాష్ట్ర బడ్జెట్ రూ. 3,22,359 కోట్లు. ఐదంకెల సంఖ్యనే సక్రమంగా పలకలేనివారు, ఆర్థిక శాస్త్రం గురించి తెలియని వారు మొత్తం అంకెల గారడీతో నిండిపోయే రాష్ట్ర బడ్జెట్‌ను ఎలా అర్థం చేసుకుంటున్నారో.. తమ శాఖల ఆర్థిక లావాదేవీలను ఎలా నడపుతున్నారో దేవుడికే తెలియాలి. బడ్జెట్ లెక్కల్లో రూపాయి రాకడ.. రూపాయి పోకడం అని కొన్ని లెక్కలు చెబుతారు. రూపాయి రాకడ అంటే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, పోకడ అంటే ఖర్చు అని అర్థం. ఈ అంచనాల ప్రకారమే పథకాలు అమలు చేయాలి. ప్రణాళికలు రూపొందించాలి. ఇక విదేశాలతో లావాదేవీలను డాలర్ల రూపంలో నిర్వహించాల్సి ఉంటుంది. ఇది మరింత సంక్లిష్టం. ఆర్థిక శాస్త్రం, గణాంకాలపై అవగాహన లేని వారు వీటిని ఎలా అర్థం చేసుకుంటారో మరి!

## వినూత్నంగా వృక్షాబంధన్



(సత్యంన్యూస్, రాజాం)

స్థానిక నరసింహనాయుడు కాలనీలో రక్షాబంధన్‌ను వినూత్నంగా వృక్షాబంధన్‌గా జరుపుకున్నారు. రాఖీ కట్టిన సోదరీమణులకు సోదరుడు పాలపర్తి సాయి సత్యసూర్య బహుమతిగా ఖరీదైన వస్తువులు డబ్బులు ఇవ్వకుండా పర్యావరణానికి రక్షణగా నిలిచే మొక్కలను ఇచ్చారు. మనిషి ప్రాణాలు నిలిపే, ప్రాణ వాయువును అందించే చెట్లు, మొక్కలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు బహుమతిగా ఇవ్వడం అనేది సోదరి ఆరోగ్యాన్ని కోరుకునే సంకేతం అని, మొక్కలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రతిసారి సోదరుడికి రాఖీ కడితే మిఠాయిలు ఖరీదైన బహుమతులు చాక్లెట్లు ఇచ్చేవారని, మొట్టమొదటిసారిగా ఒక మొక్క బహుమతిగా ఇవ్వడం సంతోషంగా ఉందని ఈ మొక్కలను నాటి జాగ్రత్తగా కాపాడుకుంటామని సోదరీమణులు తెలిపారు.

## ప్రతీ ఇంటిపై మూడురంగుల జెండా ఎగరాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు మేరకు శనివారం షిర్డీసాయినగర్ పార్కు వద్ద స్థానిక సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా, హర్ ఘర్ స్వచ్ఛత పై ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 8 నుండి 15 వరకూ ప్రతీ ఇంటిపై మూడు రంగుల జెండా, ప్రతీ ఇంటి ముందు స్వచ్ఛత పాటించాలని వివరించారు. ఈ సందర్భంగా పిఎంజె బాబు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 13,14,15 తేదీలలో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పండుగలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అదేవిధంగా ఈ మూడు రోజులు సచివాలయ పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సచివాలయ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది శివాజీ, చిరంజీవి శివ, సువర్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.




## అన్నా చెల్లెళ్ల అనురాగానికి ప్రతీక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్నా చెల్లెళ్ల అనురాగం, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పూర్ణిమ నిలుస్తుందని వైకాపా యువ నాయకులు ధర్మాన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. శనివారం నరసన్నపేట పార్టీ కార్యాలయంలో పలువురు అక్కచెల్లెళ్లు వచ్చి యువ నాయకులు కృష్ణ చైతన్యకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైకాపా మహిళా అధ్యక్షురాలు గురుబెల్లి వెంకట రమణి, జలుమూరు మండల మహిళా అధ్యక్షురాలు తర్ర మాధవి, బుద్దల రేవతి, పొట్నూరు ప్రత్యూష, లోట్ల ఝూన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.



## బంధాలను పెంపొందించే పండుగ రాఖీ

(సత్యంన్యూస్, టెక్కలి)

రక్షాబంధన్ సందర్భంగా రాష్ట్రంలోని తెలుగింటి ఆడపడచులందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. సోదరీ,సోదరుల మధ్య ఆత్మీయతలు, అనురాగాలకు ప్రతీకగా నిలిచే పండుగ ఇదన్నారు. జీవితాంతం ఒక సోదర బంధం అండగా ఉండాలని ఆడబిడ్డలు కోరుకుంటారన్నారు. అలానే తన రక్తం పంచుకున్న సోదరుల జీవితాల్లో విజయాలను ఆకాంక్షిస్తారన్నారు. రక్షాబంధన్ పండుగ మన సంస్కృతీ సంప్రదాయానికీ సంబంధిత ఔన్నత్యానికీ నిదర్శనమన్నారు. మహిళా సాధికారత సాధించేందుకు, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర చర్యలు తీసుకుందని, పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు. సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధిరంగాలలో విస్తృత అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో పనిచేస్తుందన్నారు.



## బంగారు కుటుంబాలకు వైద్యుల సహాయ హస్తం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని బంగారు కుటుంబాలకు వైద్యులు అండగా నిలుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పి4 కార్యక్రమానికి తమ వంతు మద్దతు పలికారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శుక్రవారం వారి కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన 85మంది వైద్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని 2,580 బంగారు కుటుంబాలకు తాము మార్గదర్శకులుగా నిలుస్తామని వైద్యులు కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సనపల నర్సింహమూర్తి, డిసిహెచ్ఎస్ డాక్టర్ నూర్తి కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ భవానీ, డాక్టర్ శిరీష, డాక్టర్ అరవింద్, డాక్టర్ రేవతి, పిల్లల వైద్యుడు డాక్టర్ వినోద్, జెసిఐ, ఏపీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి డాక్టర్ మనోజ్ తదితరులు కూడా పాల్గొన్నారు. గైనకాలజీ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, 75సోషల్ వెల్ఫేర్ సంస్థలను 12 జోన్లుగా విభజించి, కౌమార దశలో ఉన్న బాలికలకు హెల్త్ ఎడ్యుకేషన్ అందిస్తామని, శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ చేస్తామని, ఎనీమియా నివారణ కోసం ప్రతి వారం ఒక హాస్టల్ చొప్పున వెళ్లి సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం గ్రేటర్ పరిధిలోని 48 సచివాలయాల్లో ఎన్సీబీ (వృద్ధాప్యంలో వచ్చే సాధారణ వ్యాధులు)తో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వైద్యపరంగా సహాయ సహకారాలు అందించనున్నట్లు ఫిజీషియన్స్ అసోసియేషన్ ప్రకటించింది. అలాగే జెసిఐ కూడా మూడు అనాథ శరణాలయాలను దత్తత తీసుకోవాలని నిర్ణయించగా, లయన్స్ క్లబ్ హర్షవల్లి తరపున డాక్టర్ సత్యస్వరూప్ వృద్ధాశ్రమాల్లో ఉచిత కంటి పరీక్షలు, కళ్లజోడు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యుల ఈ సామాజిక సేవా తపనను అభినందిస్తూ, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.




# పెద్ద హీరోలకు వందల కోట్లు..

# కార్మికుల కడుపు నింపడానికి ఏడుపులు..?!

చిన్న సినిమా నిర్మాతలను బహిష్కరించాలి.. అవును. ఒక చిన్న సినిమా నిర్మాతగా నేనే చెబుతున్నాను. ఎందుకంటే, అసలే కరోనా తర్వాత సినిమా నిర్మాణంలోని ప్రతీ పనికి రేట్లు విపరీతంగా పెరిగాయి. చిన్న సినిమా నిర్మాతకు సినిమారంగంలో మినిమం గౌరవం లేదు. ఏ ఆఫీసు గడప తొక్కినా, చీప్ గా చూస్తున్నారు. ఆఫీసులో ఉన్నా లేరని, ప్యూనులతో చెప్పిస్తారు. ఫోన్లు ఎత్తరు. ఎందుకంటే, చిన్న నిర్మాత, వాళ్ళు అడిగినన్ని డబ్బులు ఇవ్వ లేడు. వాళ్ళ గొంతెమ్మ కోరికలు తీర్చలేడు. చిన్న సినిమా నిర్మాతలకు ప్రతీ పనీ ఖర్చుతో కూడుకున్నదే! కార్మికులను వాళ్ళ ఇంటి దగ్గర నుండి పికప్ చేసుకుని, లొకేషన్ కు చేరగానే టీ, కాఫీలు ఇవ్వాలి. ఓ గంట కాగానే టిఫిన్లు పెట్టాలి. ప్రతీ రెండు గంటలకు టీలు ఇవ్వాలి. లంచ్ అరేంజ్ చేయాలి. మళ్ళీ రెండు సార్లు టీలు ఇవ్వాలి. నాలుగ్గంటలకు స్నాక్స్ ఇవ్వాలి. కాల్ షీట్ వ్యవధి దాటిన తర్వాత పని చేస్తే ఒకటిన్నర కాల్షీట్ల కు డబ్బులు ఇవ్వాలి. రూల్స్ ప్రకారం ఇవన్నీ చేయవలసిన అవసరం లేదు. కానీ, దబాయించి, ఇప్పించుకుంటారు. పోనీ తిండి విషయమే కదా అని మనం ఔదార్యం ప్రదర్శించినా, ఇన్ని చేసినా, నిర్మాతకు కనీస గౌరవం ఇవ్వరు. నిర్మాత నిలబడి ఉంటే, కాలు మీద కాలు వేసుకుని కూర్చుంటారు.

బడా నిర్మాతల సినిమాలలో పనిచేసిన నటీనటులైతే, చిన్న నిర్మాతలను పురుగుల్లా చూస్తున్నారు. వీళ్ళకు పెద్ద సినిమాల్లో దిక్కు ఉండదు. కానీ, అవకాశం ఇచ్చిన చిన్న నిర్మాతను మాత్రం అవమానిస్తారు. నేను తీయబోతున్న ఒక సినిమాలో, ప్యాడింగ్ కోసమని ఒక మాజీ హీరోను తీసుకున్నాము. బాగానే ముట్టచెప్పాము.

అతనితో పాటు వచ్చిన మేనేజర్, మేకప్ మ్యాన్లు, అసిస్టెంట్లు మాకు నరకం చూపించారు. ఆ నటుడైతే, నేను కరచాలనం చేయడానికి ప్రయత్నించినా, షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ఇష్టపడలేదు. ఒక మాజీ హీరోకే ఇంత గీర ఉందనుకుంటే, అయితే, స్టార్ల విషయం చెప్పనక్కర లేదు, నేను వినడమే కానీ, నాకు ఫస్ట్ హ్యాండ్ నాలెడ్జ్ లేదు.

ఆ సినిమాకు వచ్చిన టెక్నీషియన్లు కూడా దొంగ లెక్కలు చూపించి, ఎక్కువ డబ్బులను గుంజారు. పెద్ద సినిమాలకన్నా, చిన్న సినిమాలకు, పారితోషికాల విషయంలో, తప్పక రాయితీలు ఉండాలి. పెద్ద సినిమా ఒక్క రోజు విదేశాల్లో జరిపే షూటింగు బడ్జెటుతో, మొత్తం చిన్న సినిమా పూర్తవుతుంది.

నానా చంకలు నాకి, చిన్న సినిమా తీసినా దానికి థియేటర్లు దొరకవు. ఓటీటీలోకి రానీయరు. టీవీల్లోకి తీసుకోరు. అవార్డులు రావు. సబ్సిడీలు లేవు. ప్రభుత్వం కూడా పెద్ద నిర్మాతలను ఆప్యాయంగా కౌగలించుకుంటుంది. కానీ, చిన్న నిర్మాతలను పురుగుల్లా చూస్తుంది.

ఇవన్నీ గమనించి, చిన్న సినిమా నిర్మాతలకు పని చేసే కార్మికులకు పారితోషికాలు ఇప్పుడున్న వాటికన్నా తగ్గించుకోవాలి. చిన్న నిర్మాతలు, ఏదో ప్యాషన్ తో సినిమా తీయడానికి వస్తారు తప్ప, కోట్లు కోట్లు గడించాలని కాదు. వారికి సినిమా బిజినెస్, వ్యాపారం కాదు. వారికి అది ఒక ప్రవృత్తి.

టాలీవుడ్ లో పెద్ద సినిమాలు సంవత్సరానికి మాగ్జిమమ్ పది వరకు ఉంటాయి. మిగిలినవన్నీ చిన్న సినిమాలే. ఈ చిన్న సినిమాలే, టెక్నీషియన్స్ కు తిండి పెడుతున్నాయి. కానీ, వారికి చిన్న సినిమాలంటేనే చూపు.

టాలీవుడ్ లోని అన్ని విభాగాల్లో చిన్న సినిమా, పెద్ద సినిమా అని రేట్లలో తేడా లేదు. సేమ్ సెన్సార్ ఫీజ్, సేమ్ క్యాబ్ రేట్లు, సేమ్ పబ్లిసిటీ రేట్లు. ప్రభుత్వం కూడా పెద్ద సినిమాలకు బెనిఫిట్ షోలు, టికెట్ల రేట్ల పెంపు, షో సంఖ్యల పెంపు, ఏదడిగినా ఇస్తుంది. చిన్న సినిమా నిర్మాతలను గడప కూడా తొక్కనీయదు.

వేదికల మీద మహా మానవతావాదులుగా మాట్లాడే నటీనటులు, రచయితల, నిర్మాతలు, డైరెక్టర్ల నిజ స్వరూపం వికృతంగా ఉంటుంది. అన్ని అవార్డులు వారికే కావాలి. అన్నింటా వారిదే పై చేయిగా ఉండాలి.

సినీ కార్మికులు కూడా రెండు రకాలు. బాగా సంపాదించి బలిసిన వాళ్ళు కొంత మందైతే, తినడానికి తిండి లేక, సినిమా రంగాన్ని వదిలి బయటకు వెళ్ళ లేక, అన్నమో రామచంద్రా! అని అలమటిస్తున్న వారు కొందరు. వారికి కొంత తక్కువ పారితోషికం ఇచ్చి, చిన్న నిర్మాత పని చేయించుకుంటానంటే ఒప్పుకోరు.

**పెద్ద నిర్మాతలు, సినీ కార్మికులకు 30% పెంచితే, వారికేం కష్టం కాదు. పెంచాల్సిందే.**

వంగి, వంగి దండం పెట్టి వందల కోట్లు హీరోలకు సమర్పించుకున్న వాళ్ళు కార్మికులకు పెంచడంలో తప్పు లేదు. ఇదే నిర్మాతలు, బొంబాయి, చెన్నై డాన్సర్లకు, స్టంట్ మ్యాన్లకు, నటులకు బా..గా..నే సమర్పించుకుంటున్నారు. తెలుగు సినీ కార్మికులకు ఇవ్వాలంటేనే ఏడుపొస్తుంది.

ఇప్పుడు, 30% రేట్లు పెంచితే చిన్న నిర్మాతలు ఇబ్బందులు పడతారని కపట ఏడుపులు ఏడుస్తున్నారు పెద్ద నిర్మాతలు. అందుకే, చిన్న నిర్మాతలకు, వేరే రేట్లు ఉండాలి. అలాగే, వారి సినిమాలకు థియేటర్లు ఇప్పించవలసిన బాధ్యతను కూడా ప్రొడ్యూసర్ కౌన్సిల్ తీసుకోవాలి.


క్యాబ్ రేట్లు, సెన్సార్ ఫీజులను తగ్గించే బాధ్యతను తీసుకోవాలి. పబ్లిసిటీ ఖర్చులను తగ్గించాలి. చిన్న సినిమాలకు సబ్సిడీ ఇప్పించాలి. కథను బట్టి, వినోదపు పన్ను నుండి మినహాయింపు ఇప్పించాలి. మంచి సినిమాలకు తప్పనిసరిగా అవార్డులు ఇవ్వాలి, ఇప్పించాలి. లేకపోతే, చిన్న సినిమా నిర్మాతలపై నిషేధం విధించి, వారిని బహిష్కరించండి. ఇక మీ డ్రామాలు చాలు.

- ప్రభాకర్ జైని

## 1980 క్రైమ్ థ్రిల్లర్‌లో సామ్?


ఏ మాయ చేశావే సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సమంత గత కొంతకాలంగా తెలుగులో సినిమాలు చేయడం లేదు. ఖుషి తర్వాత సమంత హీరోయిన్‌గా మరో సినిమా వచ్చింది లేదు. దీంతో సమంత కొత్త సినిమా అప్డేట్స్ కోసం ఆమె ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. గతేడాది సమంత బర్త్ డే సందర్భంగా మా ఇంటి బంగారం అనే కొత్త ప్రాజెక్టును సమంత అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. శుభంతో నిర్మాతగా సక్సెస్ సినిమాను అనౌన్స్ అయితే చేసింది కానీ మళ్లీ సమంత దాని గురించి ఎలాంటి అప్డేట్ ఇచ్చింది లేదు. మొన్నటివరకు బాలీవుడ్ పైనే ఫోకస్ చేసిన సమంత ఇప్పుడు తిరిగి టాలీవుడ్ లో బిజీ అవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే ప్రొడక్షన్ హౌస్ ను మొదలుపెట్టి శుభం అనే సినిమాతో నిర్మాతగా మారి ఆ సినిమాతో బాగానే లాభపడింది సమంత. నందినీ రెడ్డితో మా ఇంటి బంగారం వాస్తవానికి సమంత శుభం కంటే ముందే మా ఇంటి బంగారంను తన సొంత బ్యానర్‌లో అనౌన్స్ చేసింది కానీ ఎందుకో ఆ ప్రాజెక్టును పక్కన పెట్టింది. కానీ ఇప్పుడు మళ్లీ ఆ ప్రాజెక్టును సమంత పూర్తి చేయడానికి వేగంగా అడుగులేస్తున్నట్టు తెలుస్తోంది. దానికి తన ఫ్రెండ్ నందినీరెడ్డి సాయం తీసుకుంటుంది సమంత. జబర్దస్త్, ఓ బేబీ సినిమాల టైమ్ లో సమంత, నందినీ మధ్య మంచి స్నేహం కుదిరింది. మొన్నామధ్య సమంత హీరోయిన్‌గా నందినీ సినిమా చేస్తుందని వార్తలు కూడా వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం వీరిద్దరూ చేయబోయే సినిమా మా ఇంటి బంగారం అనే తెలుస్తోంది. ఓ బేబీ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న ఈ సినిమా 1980 బ్యాక్ డ్రాప్ లోని క్రైమ్ థ్రిల్లర్ గా తెరకెక్కుతుందని సమాచారం. వయొలెంట్ జానర్‌లో రూపొందనున్న ఈ సినిమాను సెప్టెంబర్ నుంచి సెట్స్ పైకి తీసుకెళ్లి వీలైనంత త్వరగా షూటింగ్ ను పూర్తి చేసి వచ్చే ఏడాది సమ్మర్ నాటికి సినిమాను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట సమంత, నందినీ రెడ్డి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



# రాహుల్ బాంబ్‌పై ఈసీ స్పందనేంటో..!

**హిరోషిమాపై యూఎస్ అణుబాంబు దాడికి 80 ఏళ్లని మాట్లాడుకుంటున్న తరుణంలోనే.. భారత ఎన్నికల కమిషన్‌పై రాహుల్ బాంబు పడింది. అదిప్పుడు సంచలనంగా మారింది. భారత రాజ్యాంగాన్ని కాపాడే పని మీకు అప్పగించారే తప్ప.. దాన్ని ధ్వంసం చేసే పని కాదంటున్నారు రాహుల్. అంతేకాదు, భారత రాజ్యాంగానికీ, పతాకానికీ వ్యతిరేకంగా వ్యవహరించిన ఓ నేరంగా అభివర్ణిస్తూ తాను పేల్చిన బాంబ్ ఇప్పుడు దేశంలో ఎన్నికల ప్రక్రియపైనా, కమిషన్ తీరుపైనా ఓ చర్చకు తెరలేపింది.**



బెంగళూర్ సెంట్రల్ పార్లమెంట్ పరిధిలోని మహదేవపూర అసెంబ్లీ స్థానాన్ని తమ ఆరోపణలకు ఆధారంగా చూపిస్తూ రాహుల్ సంధించిన ప్రశ్నలపై ఇప్పుడు ఎన్నికల కమిషన్ కచ్చితంగా సమాధానం చెప్పాల్సిన స్థానంలో బోన్‌లో నిలబడింది. ఒక్క మెతుకు చాలు అన్నం ఉడికిందా, లేదా తేల్చుడానికన్నట్టుగా.. తాము ఒక్క నియోజకవర్గంలో చేసిన అధ్యయనం భారతదేశ ఎన్నికల వ్యవస్థ పనితీరును కళ్లకు కడుతోందన్నారాయన. తాము స్టడీ చేసిన మహదేవపుర అసెంబ్లీ తరహాలోనే దేశం మొత్తం ఓ పెద్ద నేరపూరిత కుంభకోణం జరిగిందన్నది ఇప్పుడు రాహుల్ చేస్తున్న సంచలనమైన ప్రధాన ఆరోపణ. సీసీ టీవీ ఫుటేజీ ధ్వంసం చేశామని ఎన్నికల కమిషనే చెప్పిందని.. షకుణ్ రాణి అనే మహిళ రెండుసార్లు ఓటు ఎలా వేసిందో అందుకే తాము పట్టుకోలేకపోయామన్నారు.

అంతకుముందే ఎన్నికల కమిషన్‌పై ఓ అణుబాంబు వేయబోతున్నట్టు రాహుల్ ఇండికేషన్ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఢిల్లీ ఇందిరాభవన్‌ను వేదిక చేసుకున్న రాహుల్ ఈ నెల 7న ఓట్ హ్యాజ్ బీన్ డెస్ట్రాయిడ్ అనే నినాదంతో ఓ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి మరీ మీడియా ముందుంచారు. రెండుసార్లు అప్పటికే అధికారంలో ఉన్న బీజేపీని మూడోసారి కూడా గద్దెనెక్కించేందుకు ఎన్నికల కమిషన్ ఓట్లను దొంగిలించిందనే విషయాన్ని ఉదాహరణలతో సహా ప్రజల ముందుకు తీసుకువచ్చే ఒక క్రిస్టల్ క్లియర్ ప్రెజెంటేషన్ చేశారు. ఎక్కువ కాలం వరుసగా అధికారంలో ఉంటూ ప్రజా వ్యతిరేకత ఎదుర్కోనట్టుగా బీజేపీ నిలబడటానికి ఎన్నికల కమిషన్ ఆ పార్టీకి వంతపాడటమేనంటారు రాహుల్.

**అసలెందుకు రాహుల్ ఎలక్షన్ కమిషన్‌పై అంత ఫోకస్ చేశారు..?**

హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై గంపెడాశలు పెట్టుకుంది. కానీ, అక్కడా అందుకు భిన్నమైన ఫలితాలు వచ్చి అధికారం బీజేపీ వశమైంది. అలాగే, మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో 48 స్థానాల్లో 30 స్థానాలను ఇండియా కూటమి గెల్చుకున్నా.. అసెంబ్లీ ఎన్నికలకొచ్చేసరికి ఘోర ఓటమిని చవిచూసింది. ఒపీనియన్ పోల్స్ అన్నింటికి భిన్నంగా ఫలితాలు వెల్లడవ్వడం.. మహారాష్ట్రలో జనాభాను మించి ఓటర్ల సంఖ్య రిజిస్టరవ్వడం ఆశ్చర్యపర్చిందంటారు. ఐదేళ్లలో కనిపించని ఓటర్ల సంఖ్య.. అనూహ్యంగా ఐదునెలల్లో ఎలా పెరిగిందన్నది రాహుల్ ప్రశ్న? అటు ప్రజలతో పాటు ఇదే విషయంపై కాంగ్రెస్ పార్టీ అనుమానం వ్యక్తం చేసిందని, అందుకు తగ్గట్టే ఫలితాలూ వెల్లడయ్యాయంటారాయన. ఇక కర్నాటక రాష్ట్రంలో అధికారం నిలబెట్టుకున్నా.. లోక్‌సభ ఎన్నికల్లో 16 స్థానాలు గెలుస్తామనుకుంటే కేవలం తొమ్మిదికి పరిమితమవ్వడంతో రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓటర్స్, ఓటింగ్ ప్రక్రియపై ఫోకస్ చేసింది. అందుకు, కర్నాటకలోని మహదేవపూర అసెంబ్లీ రిజల్ట్స్‌పై స్టడీ చేసి.. తామేం స్టడీ చేశామో రాహుల్ ప్రజల ముందుంచారు.

**రాహుల్‌లో మరింత అనుమానాలెందుకు బలపడ్డాయి?**
**ఎందుకంత లోతుగా మహదేవపుర అసెంబ్లీపై దృష్టి పెట్టారు..?**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌ను కలిసి మహదేవపుర ఓటర్ల లిస్టును ఇమ్మంటే.. వరుసగా పేర్చితే ఏడడుగుల ఎత్తుండే బెండల్‌ను చూపిస్తూ ఇదిగో ఈ లిస్ట్ ఇచ్చారని చూపించారు. అయితే ఆ పేపర్సేవీ కూడా స్కాన్ చేసే వీలులేకుండా ఉన్నాయి. అలాంటి అవకాశమే ఉంటే.. ఇవాళ అందుబాటులోకొచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, చాట్ జీపీటీ వంటి టెక్నాలజీతో అందులో రిపీటెడ్ ఓట్లెన్ని, దొంగ ఓట్లెన్ని, బతికున్నవారెందరు, చనిపోయినవారి ఓట్లున్నాయా, ఒకే ఓటర్ పలు బూతుల్లో ఓటు కలిగి ఉన్నాడా, వివిధ రాష్ట్రాల్లోనూ, వివిధ అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ నమోదై ఉన్నాడా ఇలాంటి బోగస్ ఏరివేతకు సులభమయ్యేది. కానీ, ఎలక్షన్ కమిషన్ కాంగ్రెస్ పార్టీకిచ్చిన ఆ పేపర్స్ ఏవీ స్కానింగ్‌కు అనుకూలంగా లేవు. దాంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 40 మంది నిపుణుల వరకూ ఆ పేపర్లలో ఏరివేతకు ఆర్నెల్లు కష్టించాల్సి వచ్చిందంటారు రాహుల్. ఒక్క మహదేవపుర్ అసెంబ్లీకి సంబంధించి ఇంత పెద్ద పార్టీ స్టడీ చేయడానికే ఆరు నెలల సమయం పట్టిందంటే.. దేశంలోని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో జరిగిన ఓట్ల తీరును నిశితంగా పరిశీలించాలంటే ఎంత సమయం పడుతుందో ఊహించండంటారు. అలా అనితరసాధ్యంగా ఎవ్వరికీ దొరక్కుండా ఉండేందుకే ఈసీ చీటింగ్ చేస్తోందని.. అలాంటి అసాధ్యాలపైనే బోగస్ ఓట్లు పుట్టుకొచ్చాయని.. అలా దొంగ ఓట్లను కట్టబెట్టే ఈసీ బీజేపీని గెలిపించిందంటారు రాహుల్. ప్రస్తుతం నడుస్తున్న డిజిటల్ ఎరాలో.. డిజిటల్ అనాలిసిస్‌కు అవకాశం లేకుండా డాటానివ్వడమేంటన్న రాహుల్ ప్రశ్నకూ ఇప్పుడు సమాధానం దొరకాల్సి ఉంది. ఎందుకు ఈసీ నిజాలను దాస్తోందని ప్రశ్నిస్తున్నాడతను.

**కాంగ్రెస్ పరిశోధనలో తేలిందేంటి..?**

మహదేవపుర నియోజకవర్గంలో 6.50 లక్షల ఓట్లు ఉంటే.. అందులో 1 లక్షా 250 ఓట్లు చోరీ అయ్యాయంటారు రాహుల్. ఆ చోరీ అయిన రకాలను కూడా రాహుల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వెల్లడించారు. అందులో డూప్లికేట్ ఓటర్స్ 11,965 అయితే.. అసలు అడ్రస్ లేని ఫేక్ ఓట్లు 40వేల పైచిలుకున్నాయి. ఇక ఒకటే అడ్రస్‌లో 10,452 ఓట్లున్నాయని, ఫోటోలే లేని ఓటర్స్ 4,132 ఉంటే.. ఇక మరో ప్రధానమైన ఫామ్ 6ను దుర్వినియోగం చేసి.. యువత ఎన్రోల్ చేసుకునే చోట వృద్ధులు, ముదిమి వయస్సువాళ్ల పేర్లతో ఫామ్ 6 ఓటర్లుగా చేర్చారని.. ఆ సంఖ్య 33,692గా చెప్పుకొచ్చారు రాహుల్. దాంతోనే బెంగళూర్ సెంట్రల్ ఎంపీ బీజేపీ ఖాతాలోకి వెళ్లిందన్నారాయన.


**అనుమానం ఎక్కడ మొదలైంది..?**

బెంగళూర్ సెంట్రల్ ఎంపీ స్థానంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ గెలిస్తే.. ఒక్క మహదేవపురాలో మాత్రం బీజేపీ గెలిచింది. దాంతో తమ ఎమ్మెల్యేలున్నచోట కూడా తాము పార్లమెంట్ సీటును ఎందుకు గెలువలేకపోయామనే డౌట్ సహజంగానే కాంగ్రెస్‌లోనూ, రాహుల్‌లోనూ కలిగింది. దాంతో తమ పరిశోధనకు రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం బెంగళూర్ సెంట్రల్ పార్లమెంట్ స్థానాన్ని.. అందులోనూ మహదేవపుర స్థానాన్ని ఎంచుకుంది. బెంగళూర్ సెంట్రల్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ కేవలం 32,707 ఓట్లతో ఓటమిపాలైతే, మహదేవపురా అసెంబ్లీలోమాత్రం 1.14 లక్షల ఓట్ల భారీ తేడాతో ఓటమిపాలైంది.

ఒకే వ్యక్తి నాలుగు పోలింగ్ బూతుల్లో ఎలా ఓటు కలిగి ఉంటారన్నది రాహుల్ ప్రశ్న? అలాగే ఆదిత్య శ్రీవాత్సవ అనే వ్యక్తి పేరు కర్నాటకతో పాటు, యూపీలో కూడా ఓటర్ల లిస్టులో ఎలా ఉంటుందన్నది ఆయన మరో ప్రశ్న? ఇదేదో ఒక్క ఓటర్‌కు సంబంధించిన విషయం కాదని, వేల సంఖ్యలో ఇలాంటి తప్పిదాలను ఈసీ చేసిందని బల్లగుద్ది చెబుతున్నాడు రాహుల్. 11 వేల మంది డూప్లికేట్ ఓటర్స్ ఎక్కడిపడితే అక్కడ ఎలా పడితే అలా ఓట్ల రూపంలోకి మారుతుండటం నేరం కాదా అని నిలదీస్తున్నారు రాహుల్. ఇంటి నంబర్లు జీరోలతో ఉండటమేంటన్న రాహుల్ ప్రశ్న నిజంగా కచ్చితంగా ఆశ్చర్యపర్చేది. తాను చూపిస్తున్న డాటా ప్రకారమైతే ఆ ఫేక్ ఓట్లు కచ్చితంగా షాక్‌కు గురి చేసేవే. మొత్తం వ్యవస్థనే చోరీ చేసేశారు కదా అంటూ ఒక మెరుపుదాడి చేశారు రాహుల్. ఇక అదే మహదేవపురాలో బూత్ నెంబర్ 366లో ఒక్క సింగిల్ బెడ్రూం ఫ్లాట్‌లో చెక్ చేస్తే ఎవ్వరూ లేరు.. కానీ, అక్కడ 46 మంది పేర్లు ఓటర్ల జాబితాలో కనిపించాయి. ఇలాంటి కొన్ని ఉదాహరణలను ఆయన చూపించారు. అలాగే, ఫోటో లేకుండా.. లేదంటే, కనిపించనంత చిన్నఫోటోలతో వేల ఓట్లు ఉన్నట్టు చెప్పుకొచ్చారు.

మహదేవపుర అసెంబ్లీ స్థానంలో ఓట్ల కుంభకోణంపై రాహుల్ ఐదు రకాలగా వర్గీకరించి చూపించారు. పై నాలుగింటితో పాటు.. ఐదోది ఇంకా కీలకం. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫామ్6 ఫిల్ చేసి ఓటు వేయాల్సి ఉంటుంది. అలాంటివారిలో సహజంగా ఓటుహక్కు వచ్చిన 18 ఏళ్లవారి నుంచి మ్యాక్స్ అప్పటి వరకూ ఓటుహక్కు నమోదు చేసుకోకపోతే 25 ఏళ్ల వారివరకూ ఉండే అవకాశముంటుంది. కానీ, ఫామ్ 6 కింద వృద్ధులు, ముదిమి వయస్సు వాళ్లు మొత్తం 33వేల పైచిలుకు ఒక్క మహదేవపురాలోనే బట్టబయలవ్వడమంటే ఈసీ కచ్చితంగా నేరానికి పాల్పడిందంటున్నారు రాహుల్.

ఒక్క నియోజకవర్గంలోనే ఇన్ని అవకతవకలు బట్టబయలయ్యాయంటే.. మిగిలిన దేశంలోని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎలా మ్యానిప్యులేషన్ జరుగుతుందో ఊహించుకోండంటున్నారు. ఇలాంటి పరిణామాలతోనే గెలుపు గుర్రాలు ఓటమిపాలై.. అసలు ఊహించనివాళ్లు గెలుపు గుర్రాలవుతున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీగా ఇంత కష్టపడితే ఒక్క నియోజకవర్గం డాటా మాత్రమే మేం సంపాదించగలిగితే.. గెలుస్తామనుకుని ఓటమిపాలైన వ్యక్తులు ఒక్కరుగా ఇంత పరిశోధన చేయగలరా అన్నది రాహుల్ ప్రధాన ప్రశ్న ఇప్పుడు.




అయితే, ఇలాంటి ఆరోపణలు చాలామంది నాయకులు చేస్తూనే ఉన్నారు. రాహుల్ మాత్రం కాస్త ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగలిగారు. ఆంధ్రప్రదేశ్ గత అసెంబ్లీ ఎన్నికలపైనా చాలా అనుమానాలు నెలకొన్నాయి. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటివారు బాహాటంగానే ఏం అవకతవకలు జరిగాయో వెల్లడించారు. పోల్ అయిన ఓట్లకూ.. లెక్కించిన ఓట్లకు మధ్య 12.54 శాతం తేడా ఉందని ఆయన ఆరోపించారు. ఆ ఎన్నికల రిజల్ట్స్ వెల్లడైన పది రోజుల్లోనే డాటా మొత్తం లేకుండా చేశారన్నదీ ఆయన ప్రధానారోపణ. సెక్షన్ 81 రిప్రజంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ ప్రకారం 45 రోజుల వరకూ ఎన్నికల ఫలితాల డాటా ఉంచాలనీ.. కానీ, దాన్ని తుంగలో తొక్కారనీ అరుణ్ కుమార్ ఆరోపించారు. అలాంటి వాటిల్లో చంద్రబాబు నిపుణుడంటూ ఆయన చురకలంటించారు.

తాజాగా ఈసీపై రాహుల్ వేసిన బాంబుతో పాటు.. గతంలో చాలామంది ఈసీ తీరును తప్పుబడుతున్న నేపథ్యంలో ఇప్పుడు ఈసీ విశ్వసనీయతపైనే నీలినీడలు కమ్ముకంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీ ఏవిధంగా స్పందిస్తుంది.. రాహుల్ ప్రశ్నలకు ఏం సమాధానాలు చెబుతుంది.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇంటర్ఫియర్ అవుతుందా.. ఏం జరుగనుందన్న ఒక ఉత్కంఠ మాత్రం సర్వత్రా కనిపిస్తోంది. అదే సమయంలో రాహుల్ కూడా సమర్థవంతంగా తన ప్రెజెంటేషన్‌తో ఇప్పుడు జనం చర్చల్లో నానుతున్నారు.

**- బాతాఖానీ సౌజన్యంతో..**

---

# రూ.80 కోట్ల ఆస్తి.. పద్మశ్రీ పురస్కారం..
# అయినా చందాలతో అంత్యక్రియలు..!



**వృద్ధాప్యం ఒక వరం కాదు, శాపం అంటూ సమాజంలో ఒంటరి బతుకును గడుపుతున్న ఎందరో పండుటాకులకు శ్రీనాథ్ ఖండేల్‌వాల్ జీవితం ఒక నిలువుటద్దం. రూ.80 కోట్ల ఆస్తిపాస్తులు సంపాదించినా, వందకు పైగా ఆధ్యాత్మిక పుస్తకాలు రాసినా, పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నా, జీవిత చరమాంకంలో ఒంటరితనమే ఆయనకు మిగిలింది.**

**కా**శీలో పుట్టిన శ్రీనాథ్ ఖండేల్‌వాల్ ఆధ్యాత్మిక సాహిత్యంలో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం ఒక వేదంలా భాసించేది. సమాజానికి మంచిని బోధించిన ఆయన జీవితం మాత్రం విషాదాంతమైంది. తన కొడుకు, కూతురు ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఎన్నో కలలు కన్నారు. కొడుకు వ్యాపారవేత్తగా, కూతురు సుప్రీంకోర్టు లాయర్‌గా మారినప్పుడు ఆయన ఆనందానికి అవధులు లేవు. కానీ, ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. ఆయన ఆస్తిపై కన్నేసిన పిల్లలు, ఆయన అనారోగ్యంతో ఉన్నప్పుడు రోడ్డుపై వదిలేశారు. సమాజానికి వెలుగు చూపిన ఆ మహానుభావుడి జీవితం చీకట్లో మునిగిపోయింది. ఆస్తి, అంతస్తులు, గౌరవం, పురస్కారాలు.. అన్నీ ఉన్నప్పటికీ, కన్నబిడ్డల ప్రేమకు నోచుకోలేకపోయారు.

కొందరు సామాజిక కార్యకర్తలు రోడ్డుపై పడి ఉన్న శ్రీనాథ్‌ను గుర్తించి, కాశీలోని ఒక వృద్ధాశ్రమంలో చేర్చారు. ఆ వృద్ధాశ్రమం ఆయనకు ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. అక్కడ ఆయన సంతోషంగానే ఉన్నారు. కానీ, ఆయన మనసులో మాత్రం ఒకటే బాధ. కన్నబిడ్డలు ఒక్కసారైనా వచ్చి పలకరించకపోవడం ఆయన గుండెను గాయం చేసింది.

**ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించినప్పుడు, ఆ వృద్ధాశ్రమమే ఆయనకు ఆశ్రయం కల్పించింది. చివరకు, ఆ ఒంటరి పోరాటం ముగిసింది. శ్రీనాథ్ ఖండేల్‌వాల్ కన్నుమూశారు. ఆయన మరణవార్తను పిల్లలకు తెలియజేసినప్పుడు, వారికి తీరిక లేదని సమాధానం ఇచ్చారు. రూ.80 కోట్ల ఆస్తిని అనుభవించిన ఆ కొడుకు, కూతురు తమ తండ్రి చివరి చూపు చూడటానికి కూడా రాలేదు. మానవత్వానికి మరణశయ్యపై నిలువున నిలిచిన ఆ దృశ్యం కంటిని తడి చేస్తుంది.** చివరికి, ఒక సామాజిక కార్యకర్త అయిన అమన్, ప్రజల నుంచి విరాళాలు సేకరించి, ఆ మహానుభావుడి అంత్యక్రియలు పూర్తి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సంఘటన మన సమాజంలో మానవత్వం ఎంత క్షీణించిందో, వృద్ధుల పట్ల మన వైఖరి ఎలా మారిందో తెలియజేస్తుంది. శ్రీనాథ్ ఖండేల్‌వాల్ ఒక పద్మశ్రీ పురస్కార గ్రహీతగా కాదు, ఒక బాధిత తండ్రిగా చరిత్రలో నిలిచిపోయారు.

**- సత్యం ఐటీ డెస్క్**





---

## బహిరంగ ప్రకటన

శ్రీకాకుళం,
తేది: 09-08-2025

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయినటువంటి టంకాల వెంకటరమణ, S/o టంకాల శ్రీరాములు (లేటు), డోర్ నెంబరు 9-238, గౌరమ్మవీధి, టెక్కలి మండలం, టెక్కలి గ్రామం మరియు టెక్కలి పోస్టు, శ్రీకాకుళం జిల్లా, పిన్: 532 201 ఇచ్చిన భోగట్టాపై ఈ తేదీన ఇస్తున్న బహిరంగ ప్రకటన

**షెడ్యూలు**

శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ వారి ఇలాకా చేరిన నరసన్నపేట మండలం, నరసన్నపేట పంచాయతీ, గొట్టిపల్లి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలో యున్నటువంటి సర్వే నెం. 104-1 రైతు వారి పల్లంనకు చెందిన నరసన్నపేట టౌను, వార్డు నెంబరు 23, బ్లాక్ నెంబరు 23, శ్రీరామ్‌నగర్ కాలనీ ఏరియాలో గల నరసన్నపేట గ్రామ పంచాయతీలో పి.ఆర్. నెంబర్ 93, తే.31.3.95దీ, ఎం.ఆర్.నెం.470, తే.31.3.95దీ., డి.డి.ఎస్. నెం. 128/95రు గా ఎప్రూవల్ కాబడిన లే-అవుట్ స్థలములో గల ప్లాట్ నెం. 102 రు తూర్పు-పశ్చిమలకు 15 అడుగులు, ఉత్తర-దక్షిణలకు 60 అడుగులు అనగా 900 చ॥గ॥లు విస్తీర్ణం గల స్థలంలో నిర్మించియున్నటువంటి డోర్ నెం.23-117 రు, అసెస్మెంట్ నెం.1929రు, ఎస్.సి. నెం. 7055,4910 ర్లు గల గ్రౌండ్ ఫ్లోర్ డాబా యిల్లు తూర్పు-పశ్చిమలకు 15 అడుగులు, ఉత్తర-దక్షిణలకు 60 అడుగులు అనగా 900 చ॥అ॥లు.

**యిందు పైని నిర్మించిన ఫస్ట్‌ఫ్లోర్ డాబాయిల్లు తూర్పు-పశ్చిమలకు 15 అడుగులు, ఉత్తర-దక్షిణలకు 60 అడుగులు అనగా 900 చ॥అ॥లు విస్తీర్ణం గల మొత్తం ఆస్తికి హద్దులు:**

**తూర్పు:** ప్లాట్ నెం. 101రు ఖాళీస్థలం
**దక్షిణ:** కాలనీ రోడ్డు
**పశ్చిమ:** దీర్ఘాశి పుణ్యవతి తాలూకా ప్లాట్ నెం.103 రు డాబాయిల్లు
**ఉత్తర:** డ్రైనేజీ కాలువ

పై షెడ్యూలు ఆస్తిని నా క్లయింట్ రిజిస్టర్ క్రయము ద్వారా కొనదలచుకున్నాడు. దీనిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో వెంటనే నాకు తెలియపర్చగలరు.

ఇట్లు
**ధర్మాన వెంకటరమణమూర్తి**
న్యాయవాది, నరసన్నపేట

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

### తప్పించుకునే ఎత్తుగడ..

# ఈఎన్‌సీ చెయ్యి'కట్టు' కథ!

(మొదటిపేజీ తరువాయి)

2020 ఫిబ్రవరిలో తూతిక మోహనరావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ కేసు నమోదు చేసింది. అదే ఏడాది నవంబరులో కేవీఎస్ఎన్ కుమార్ మీద కూడా ఇటువంటి కేసే నమోదైంది. ఈ రెండింటి వెనుక శ్రీనివాస్ ఉన్నారనేది డిపార్ట్‌మెంట్‌లో టాక్. వీరెవరూ తన పోస్టుకు పోటీ రాకుండా చేయడానికి ఏసీబీ అస్త్రాన్ని శ్రీనివాసే ప్రయోగించారని చెప్పుకునేవారు. ఇప్పుడు అదే ఏసీబీ అస్త్రాన్ని వాడుకొని వీరితో పాటు మరికొందరు శ్రీనివాస్‌ను ఆయన భాగస్వామ్య సంస్థ సత్యసాయి కన్‌స్ట్రక్షన్ ద్వారానే ఏసీబీ ట్రాప్ చేయించినట్లు తెలిసింది. శ్రీనివాస్‌పై కూడా ఏసీబీ గతంలో అసెట్స్ (ఆదాయానికి మించిన ఆస్తులు) కేసు పెట్టడం.. అది ఇంత వరకు తేలకపోవడంతో ఏ స్థాయిలో ఎలా మేనేజ్ చేయాలో ఆయనకు తెలిసిపోయింది. నెలాఖరుకు రిటైర్ కావాల్సిన తాను బెయిల్ లేకుండా జైలులో ఉండటం కంటే ఏదో ఒకటి చేసి బయటపడాలన్న యోచనతోనే శ్రీనివాస్ చెయ్యి విరగ్గొట్టుకొని ఉంటారని కొందరు భావిస్తున్నారు. ఏసీబీ ట్రాప్ నిజమా? కల్పితమా? అన్నది పక్కనపెడితే శ్రీనివాస్ మాత్రం అవినీతిపరుడని ఆ శాఖలో ఎవర్ని అడిగినా చెబుతారు. కిందిస్థాయిలో ఏఈ, డీఈ, ఈఈలు కూడా తమకు వచ్చిన వాటాలు నేరుగా తనకే ఇవ్వాలని ఈఎన్‌సీ కోరిన సందర్భాలు.. కాదంటే వేధించిన ఘటనలు కోకొల్లలని చెప్పుకొంటున్నారు.

## ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా కృష్ణమాచార్యులు

(సత్యంన్యూస్, హిరమండలం)



హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా (వైస్‌ఛైర్మన్) ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట గ్రామానికి చెందిన కొయిలాపు కృష్ణమాచార్యులు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.కాళేశ్వరం వెల్లడించారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలకు పార్టీ అధిష్టానం గుర్తించినందుకు ఫలితమే ఈ పదవి అని వ్యాఖ్యానించారు. తన నియామకానికి కృషి చేసిన పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పార్టీకి మంచి పేరు తీసుకొస్తానని కృష్ణమాచార్యులు తెలిపారు. కాగా ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైనందుకు ఆయన్ను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలుపుతున్నారు.

## గురుకులంలో మిగులు సీట్లకు

# 16న ప్రవేశ పరీక్ష




(సత్యంన్యూస్, గార)

వమరవల్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం (బాలికలు)లో 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న ఖాళీల్లో ప్రవేశానికి ఈ నెల 16న పరీక్ష నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతిలో బీసీ-ఎ ఒకటి, 7వ తరగతిలో బి.సి-బి ఒకటి, ఎస్టీ ఒకటి, 8వ తరగతిలో ఓసి ఒకటి, ఎస్సీ ఒకటి, పిహెచ్సి ఒకటి.. ఇలా మిగిలి వున్న ఖాళీల్లో ప్రవేశానికి పరీక్షలో ప్రతిభ, రోస్టర్ ప్రాతిపదికన ఏపీఆర్ఎస్ సెట్ 2025 నియమావళిని అనుసరించి ప్రవేశాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 16న ఈ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి 12 వరకు వరకు పరీక్ష ఉంటుందని, అదేరోజు ఫలితాలు ప్రకటించి ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల వివరాలు తెలుపుతామన్నారు. అర్హులైన ఆసక్తి గల అభ్యర్థులు వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం, కుల ధృవీకరణ పత్రాలతో పాఠశాలలో నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



శ్రీకాకుళం నియోజకవర్గ నగర పరిధి కలెక్టర్ బంగ్లా దగ్గర శ్రీదేవి భూదేవి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీతాళ్లపాక అన్నమాచార్య సంకీర్తన గాన యజ్ఞం, ముగింపు వేడుకలు, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. స్వారాత్మిక సంగీత విద్యాపీఠం శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరవగా, పోలుమహంతి జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, కొంక్యాన ఆదినారాయణ, మెట్ట సుజాత, బెహరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## గణపతి నవరాత్రులకు

# 10న పందిరిరాట

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొండేటివీధిలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి స్వామి దేవాలయంలో ఈ నెల 27 నుంచి వినాయక నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఉదయం 7:42 గంటలకు పందిరి రాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ, మొండేటివీధి శ్రీశ్రీశ్రీ షిరిడీసాయి సేవా సంఘం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని వారు ఆ ప్రకటనలో కోరారు.



## శిష్టకరణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించండి

- శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కుమహంతి రాజా
- సానుకూలంగా స్పందించిన వైజాగ్ పశ్చిమ ఎమ్మెల్యే గనబాబు



(సత్యంన్యూస్, విశాఖపట్నం)

కొన్ని దశాబ్దాలుగా విశాఖపట్నం జిల్లా పరిధిలో అత్యధికంగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్న శిష్టకరణ ప్రజానీకానికి గుర్తింపు, ప్రాబల్యం కోసం ప్రభుత్వం తరపున శిష్టకరణం కమ్యూనిటీహాల్‌కు స్థలం కేటాయించి, నిర్మాణానికి సహకరించి ప్రభుత్వ మద్దతు, గుర్తింపు తమ సంఘానికి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిష్టకరణం సంఘం అధ్యక్షులు, టీడీపీ రాష్ట్ర శిష్టకరణం సాధికార సమితి కన్వీనర్ అక్కుమహంతి రాజా కోరారు. ఈమేరకు ఆయన కార్యవర్గం ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబుకు వినతి పత్రం ఇచ్చారు. వెనుకబడిన వర్గానికి చెందిన తమ కులానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంఘం తరపున విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలోనే కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించడానికి ప్రభుత్వానికి స్వయంగా తానే వినతిపత్రం ఇస్తానన్నారు. నిర్మాణానికి కూడా తన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానాపురం గౌరీశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బలివాడ సత్యారావు, రాష్ట్ర శిష్టకరణ సంఘం కార్యవర్గ సభ్యులు చక్రధరమహంతి కవిత, దాదిరావు వరప్రసాద్, నాగుమంత్రి వెంకటేశ్వరరావు, బాసంగి తిరుపతిరావు, ప్రతాపరావు శ్రీనివాస్, మణిపాత్రుని సత్యనారాయణ పాల్గొన్నారు.

# అక్రమ బదిలీలు రద్దుచేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేజీబీవీ ప్రిన్సిపాల్స్‌పై అక్రమ బదిలీలను రద్దుచేయాలని, రాజకీయ జోక్యాన్ని నియంత్రించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ & ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ బి.కాంతారావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. జిల్లాలోని కంచిలి, గార, పొందూరు కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాల్స్‌ను ఎలాంటి విచారణ జరపకుండా, కేవలం స్థానిక ఎమ్మెల్యేల లేఖల ఆధారంగా బదిలీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. స్థానిక ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలపై విచారణ జరపకుండానే చర్యలు తీసుకోవడం అత్యంత బాధాకరమని, ప్రిన్సిపాల్స్ బదిలీకి రాష్ట్ర కార్యాలయం అనుమతి తప్పనిసరనే నిబంధన ఉల్లంఘించడమే కాకుండా, బదిలీ కారణంగా కేవలం అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ అని పేర్కొనడం వాస్తవాలను దాచే ప్రయత్నంగా కనిపిస్తోందన్నారు. తక్షణమే ముగ్గురు కేజీబీవీ ప్రిన్సిపల్స్ బదిలీలు రద్దు చేయాలని లేకపోతే ఈ నెల 11న సోమవారం ఎస్ఎస్ఎ ఏపీసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. బాధిత ప్రిన్సిపాల్స్‌లో ఒకరు అనేక సమస్యలపై పత్రాల రూపంలో ఏపీసీకి తెలియజేసినా, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా, సమస్యలు ప్రస్తావించిన మహిళా ప్రిన్సిపల్‌ను బదిలీ చేయడం అన్యాయమన్నారు.

బాధిత ముగ్గురు ప్రిన్సిపాల్స్ కూడా ఒంటరి మహిళలని, వీరి కుటుంబాలు వీరి జీవనాధారంపై పూర్తిగా ఆధారపడి ఉన్నాయన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని వారు కోరారు. మహిళా ప్రిన్సిపాల్స్‌కు ప్రభుత్వం రక్షణ కల్పించి, వారికి అండగా ఉండాలని డిమాండ్ చేశారు.

## సోదర భావం పెంపొందించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రక్షాబంధన్ సందర్భంగా ప్రతి ఒక్కరూ సోదరభావం పెంపొందించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం రక్షాబంధన్ నిర్వహించారు. మొదటిగా ఎస్పీకి, వారి సిబ్బందికి రాఖీలు కట్టారు. అదేవిధంగా వన్‌టౌన్ ఎస్సై హరిక్రిష్ణ, టూటౌన్ ఎస్సై సంతోష్ తదితరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ వీరితోపాటు ఇంటిలిజెన్స్ డిపార్ట్మెంట్, గవర్నమెంట్ అధికారులకి, ట్రాఫిక్ పోలీసులకి, పోలీస్ స్టేషన్‌లకి, ఫైర్ డిపార్ట్మెంట్, జర్నలిస్ట్ సోదరులకు, సామాన్య జనాలకు విద్యార్థులకు శ్రీకాకుళం టౌన్‌లో గల చాలా ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేశామన్నారు. దేశంలో మహిళల పట్ల చిన్నచూపు అణిచివేత, మహిళలపై అత్యాచారాలు దేశంలో తారస్థాయికి చేరుకున్నాయన్నారు. దేశంలో కుల,మతం అనే పేరుతో విద్వేషాలతో రెచ్చగొడుతూ నేటి రాజకీయాలు ఉన్నాయని, ఈ సమాజంలో స్త్రీ గౌరవంగా బతకాలంటే జెండర్ ఈక్వాలిటీ పోవాలన్నారు. సుమారు 200 మందికి పైగా రాఖీ కట్టామన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.ఖగేశ్, ఉపాధ్యక్షులు సిహెచ్ రాజు శ్రీకాకుళం జిల్లా గర్ల్స్ కమిటీ సభ్యులు వందన ,శిరీష, చాందిని, సిరి తదితరులు పాల్గొన్నారు.

## మెడకు ఉరి తాళ్ళు బిగించుకుని నిరసన

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోకు భూములిచ్చిన దళిత కార్మికుల పొట్ట కొట్టవద్దని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో మరో మద్యం డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గత 11 రోజులుగా ఆందోళన చేస్తున్న హమాలీలు 12వ రోజు శనివారం మెడకు ఉరి తాళ్ళు బిగించుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. భూములిచ్చిన కార్మికుల ఉపాధి దెబ్బతీసేలా వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు నాయకులు టి.రామారావు, ఎన్.సురేష్, ఎన్.రమణ, బోనెల.రాము, పి.రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కె.వి రమణ, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## వెలమ సంక్షేమ సంఘానికి సహకరిస్తాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వెలమ సంక్షేమ సంఘానికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. గార మండలం, అంపోలు గ్రామం, జైలురోడ్డు దారిలో వెలమ సంఘ నూతన భవనానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ అన్ని మతస్థులకు, కులస్తులకు, అన్ని సంఘాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. వెలమ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి గతంలో రూ.లక్ష అందించానన్నారు. త్వరితగతిన భవనాన్ని నిర్మించాలని, అందుకు కావలసిన ఎటువంటి సహాయానికైనా ముందుంటానని తెలిపారు. ఇంకా అవసరమనుకుంటే కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుల సహకారం కూడా అందేలా చూస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను వెలమసంఘ సభ్యుల బృందం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్ష బృందం ప్రతినిధులు, టీడీపీ నాయకులు, మహిళానాయకులు, వెలమ సంక్షేమ సంఘ ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

(సత్యంన్యూస్, టెక్కలి)

అనారోగ్య పరిస్థితులతో ఆర్థికంగా సతమతమవుతున్న పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ కార్యాలయంలో శనివారం 18మంది లబ్ధిదారులకు రూ.23,44,463ల చెక్కులను మంత్రి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఇప్పటివరకు 81మంది లబ్ధిదారులకు రూ.1.30కోట్లు లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందించామన్నారు. వైద్యఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి వెలుగులు నింపుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు అన్ని విధాలా మేలు చేసేలా పని చేస్తుందన్నారు. వైద్యఖర్చులతో ఆర్థిక అవస్థలు పడుతున్న ప్రజానీకానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తంలా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులు సైతం పక్కదారి పట్టించారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 400 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి అందించడం జరిగిందన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా మంత్రి వర్యులకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# సమస్యలు పరిష్కారం చేయకపోతే సమ్మె తప్పదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చెయ్యకపోతే సమ్మె తప్పదని మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధులు నిలుపుదల చేసి రాష్ట్ర వ్యాప్తంగా 1గంట సమ్మెను శనివారం టూల్‌డౌన్ చేసి నిరసన తెలియజేశారు. ఆయా డివిజన్, సచివాలయం పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరూ పాల్గొని నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వాలని, పర్మినెంట్ కార్మికులకు ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవ్‌లు సకాలంలో అందించాలన్నారు. తల్లికి వందనం పథకం, అంబేద్కర్ విదేశీ విద్య దీవెన పథకాలు అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులు కనీస వేతనాలు స్కిల్డ్ వర్కర్స్‌కి రూ.24,500లు, సెమీ స్కిడ్ వర్కర్స్‌కు రూ.29400లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, అర్జీ పెద్దమని, గోపిబాబు, గురుస్వామి, సురేష్, రసూల్, రామచంద్ర, సూర్యకళ, అర్జీ లక్ష్మి, కె.సరస్వతి, సీతమ్మ, డి.రమణ, సోషల్ మీడియా ప్రతినిధులు అరుగుల రమణ, కళ్యాణి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు




# తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ కో-ఆర్డినేటర్‌గా తొత్తడి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ కో-ఆర్డినేటర్‌గా తొత్తడి మణికంఠ నియమితులయ్యారని బిహెచ్ఆర్స్ వైస్ చైర్‌పర్సన్ డా.ఎన్.ప్రభు, ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డా.చింతపట్ల వెంకటాచారు, ఫౌండర్ ప్రెసిడెంట్, చైర్మన్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అందించిన నియామికపత్రాన్ని, స్థానిక న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు ప్రాంగణంలో అందించి మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా నివాసి ప్రముఖ సంఘ సేవకులు, సామాజిక వేత్త, సమాజ సేవా రంగంలో విశిష్టమైన కృషి, నిరంతర సేవలను గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ డాక్టర్ తొత్తడి మణికంఠరావును శ్రీకాకుళం జిల్లా చీఫ్ కోఆర్డినేటర్‌గా నియమించటం ఆనందదాయకమన్నారు. మణికంఠ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిభావంతులైన వ్యక్తులను గుర్తించి, వారి ప్రతిభను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థకు పరిచయం చేయడమే కాకుండా, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా సమాజ అభ్యున్నతికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం మణికంఠను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జైశ్రీరామ్, బీహెచ్ఆర్స్ ఏపీ అధ్యక్షురాలు మణిశర్మ, జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతిర్మయి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సౌజన్య, లయన్ ఉర్లం శివతేజ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.